క్లుప్తంగా

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: ప్రైవేట్ సంస్థల్లోని వివిధ ఉద్యోగాల భర్తీకి మంగళవారం తమ కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి ఎన్.మైత్రిప్రియ పేర్కొన్నారు. పదవతరగతి, ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీతో పాటు బిటెక్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు తగిన ధృవపత్రాలతో నేరుగా ఉద్యోగ మేళాకు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 83 284 28933 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానం

నాంపల్లి: శోభకృతు ఉగాది నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని శిఖరం ఆర్ట్ థియేటర్స్ సంస్థ ఆధ్వర్యంలో దేశ రాజధాని న్యూఢిల్లీలో ఉగాది జాతీయ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు స్థాపక కార్యదర్శి జి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి నెలలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో సంగీతం, సాహిత్యం, నాట్యం, రంగస్థలం సినీ, టీవీ, రాజకీయ, వైద్య, విద్య, న్యాయ, క్రీడలు, పండిత, పురోహిత, వాస్తు, జ్యోతిష తదితర రంగాల వారు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఫిబ్రవరి 15వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం 9494523562 ఫోన్ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

70 స్థానాల్లో ప్రజా ఏక్తా పార్టీ పోటీ

అఫ్జల్‌గంజ్: రానున్న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 70 స్థానాల్లో పోటీ చేస్తామని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు.సోమవారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామన్నారు. తమ పార్టీలో మహిళలకు, యువతకు పెద్దపీట వేస్తున్నామన్నారు.పార్టీ సీనియర్ నాయకులు వి నర్సింగ్ రావు, దూద్‌పాల నరేష్, రాజు, ఎం కే నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసిపి జి. శంకర్‌రాజు

గోల్కొండ: రోడ్డు, భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని బేగంపేట్ ట్రాఫిక్ ఇనిస్టిట్యూట్ ఏసిపి జి. శంకర్‌రాజు అన్నారు. సోమవారం మెహిదీపట్నంలోని సెయింటాన్స్ మహిళా కళాశాలలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన కళాశాల విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.అమృత, స్టూడెంట్ డీన్ డాక్టర్ మెహిత పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

రాజేంద్రనగర్: రానున్న ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయనున్నట్లు రాజేంద్రనగర్ అసెంబ్లీ కోర్ కమిటీ సభ్యులు వెల్లడించారు. సోమవారం ఎనిమిది మంది సభ్యులతో కూడిన అసెంబ్లీ కోర్ కమిటీని నియమించారు. అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేష్‌యాదవ్, జాయింట్ కన్వీనర్ మహాలింగంగౌడ్, పాలక్ మర్రి శశిధర్‌రెడ్డి, ప్రబారి సాయిప్రసాద్, డాక్టర్ ప్రేమ్‌రాజ్‌యాదవ్, టి.అంజన్‌కుమార్, నారగూడెం మల్లారెడ్డి, వై.శ్రీధర్ సభ్యులుగా ఉన్నారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి బస్తీలో కార్నర్ మీటింగ్స్ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వ, స్థానిక ఎమ్మెల్యే వైఫల్యాలను ఎండగడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీఎస్ఎల్‌పీఆర్‌బీ నిర్ణయం హర్షణీయం

హిమాయత్‌నగర్: ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) నిర్ణయించడం హర్షణీయమని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర అన్నారు. పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన ప్రాథమిక పరీక్ష ప్రశ్నా పత్రంలో తప్పుగా వచ్చిన 7 ప్రశ్నలకు మార్కులను కలపాలని అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో వారికి ప్రయోజనం చేకూరేలా కోర్టు ఆదేశాలు ఇవ్వడం, వాటిని అమలు చేస్తూ టీఎస్ఎల్‌పీఆర్‌బీ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని సోమవారం ఓ ప్రకటనలో ధర్మేంద్ర పేర్కొన్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి ఆధ్వర్యంలో యువజన, విద్యార్థి సంఘాల నేతృత్వంలో గత నెలలో చేపట్టిన నిర్విరామ పోరాట ఫలితంగానే బోర్డు ఈ నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు.

సెట్విన్.. నిరుద్యోగ యువతకు ఆశాదీపం


శిక్షణ పూర్తి చేసుకున్న వారికి జ్ఞాపిక, సర్టిఫికెట్‌తో సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్

దూద్‌బౌలి: నిరుద్యోగ యువతీ, యువకులకు రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్ ఆశాదీపంగా నిలుస్తుందని చార్మినార్ శాసనసభ్యులు ముంతాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. సోమవారం మోతీగల్లీ సెట్విన్ శిక్షణ కేంద్రంలో వివిధ వృత్తి విద్యా కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉర్దూ మస్కాన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ రావుతో కలిసి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెట్విన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తున్నారు. నిరుద్యోగులకు సెట్విన్‌లో అందిస్తున్న ఉపాధి, వృత్తి విద్యా కోర్సులు యువతకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు.

- సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వేణుగోపాల్ రావు మాట్లాడుతూ... సెట్విన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వివివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి మెరిట్ ప్రాతిపదికన జ్ఞాపిక, సర్టిఫికెట్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ అకౌంట్స్ ఆఫీసర్ ఎపి.ఓంప్రకాశ్, మేనేజర్ మోయిజ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక


హోంమంత్రి మహమూద్ అలీకి చిత్రపటాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చార్మినార్: బీఆర్ఎస్ పార్టీ చేరిన పాతబస్తీ సుల్తాన్ షాహీకి చెందిన గడ్డం సత్యనారాయణ హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీకి శాలువా కప్పి చిత్రపటాన్ని అందజేశారు. పార్టీలో చేరుతున్నందుకు మంత్రి మహమూద్ అలీ ఆయనను అభినందించారు. కార్యక్రమంలో పుస్తె శ్రీకాంత్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ మొఘల్‌పురా డివిజన్ అధ్యక్షులు పుప్పాల రాధాకృష్ణ, నరేశ్ కుమార్ వాల్మీకి, రాం ప్రసాద్, సురేందర్ అసుతోష్, కిశోర్ పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతా రాహిత్యం..


ప్లాస్టిక్ కవర్లలో విద్యార్థులకు తినుబండారాలు

లంగర్‌హౌస్: ప్లాస్టిక్ కవర్లు నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందాం అని గాంధీ ఫోటోతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విప్లవాత్మకంగా చర్యలు తీసుకుంటున్నాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం గాంధీ వర్ధంతి సందర్భంగా బాపూఘాట్‌లో విద్యార్థులకు ప్లాస్టిక్ కవర్లలో తినుబండారాలు అందించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గోషామహల్‌లో జోరుగా 'హాత్ సే హాత్ జోడో'


కార్యక్రమంలో పాల్గొన్న పుష్పలీల, రోహన్‌రెడ్డి, మెట్టు సాయికుమార్, నిర్మల్ యాదవ్

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీ హాత్ సే హాత్ జోడో కార్యక్రమం జోరుగా నిర్వహించారు. గోషామహాల్ నియోజకవర్గంలోని ఉస్మాన్‌షాహిఈ, గౌలిగూడ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ప్రజలకు అవగాహన కల్పించారు. మాజీ మంత్రి పుష్పలీల, రాష్ట్ర కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, ఖైరతాబాద్ ఇన్‌చార్జ్ రోహన్‌రెడ్డి, గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు నిర్మల్ యాదవ్‌లు కాంగ్రెస్ పార్టీతో కలిగిన లాభాలను ప్రజలకు వివరించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో ప్రజలు అన్ని విధాల నరకయాతన చూస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశార. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్యామ్‌సింగ్, కిషన్, వెంకటేష్, సైని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో వైద్య ఆరోగ్య రంగానికి తగిన ప్రాధాన్యం కల్పించాలి


గాయత్రిదేవి, కామినేని సీఓఓ

సుల్తాన్‌బజార్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌లో ఆరోగ్య రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతో ఉందని కామినేని ఆసుపత్రి సీఓఓ డాక్టర్ గాయత్రి కామినేని అభిప్రాయపడ్డారు. మంత్రి నిర్మల సీతారామన్ సమర్పించిన 2022–23 కేంద్ర బడ్జెట్‌లో, ఆరోగ్య సంరక్షణలో భారతదేశాన్ని జి-20 లీడర్‌గా చేసిందని ఆమె అన్నారు. డిజిటల్ హెల్త్ ఎనోవేషన్ హెల్త్‌కేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌కు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడంతో ఈ బడ్జెట్ హెల్త్ కేర్ రంగంపై భారీ ప్రభావం చూపిస్తుందని భావిస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రవేశపెట్టే బడ్జెట్‌లో భారత పౌరులకు సరసమైన వైద్య సంరక్షణ పరిష్కారాలను అందించడంపై దృష్టి సారించి వ్యూహాత్మకంగా ప్రణాళిక చేయాలన్నారు

ఘనంగా బ్రాహ్మణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న బంగారయ్య శర్మ, చిత్రంలో ఎస్.వాణీదేవి, బాల శ్రీనివాసులు

నాంపల్లి: బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో బ్రాహ్మణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీ బంగారయ్య శర్మ, ఎమ్మెల్సీ ఎస్.వాణీదేవి హాజరై సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా బంగారయ్య శర్మ మాట్లాడుతూ... రోగుల కష్ట సుఖాల కోసం తమ జీవితాన్ని త్యాగం చేసేవాళ్ళే సరైన వైద్యులని అలాంటి వైద్యులు సమాజం కోసం కూడా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రాంగోపాల్, డాక్టర్ దివ్యమాలిని, డాక్టర్ బాలరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరిశుభ్రత పాటించాలి

ఎమ్మెల్యే కౌసర్


ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన టోలిచౌకి, గోల్కొండ డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన టోలిచౌకి డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. టోలిచౌకి, అక్బర్‌పురాలో జరుగుతున్న వరదనీటి పైపుల నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. ఈ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన ఛోటాబజార్ వద్దగల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మలక్‌పేట్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఇద్దరు బాలింతలు మృతి చెందారని అయితే వీరి మృతికి డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణలు వస్తున్నాయని ఆయన అన్నారు. వైద్యులతో పాటునర్సింగ్ సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా ఆస్పత్రిలో వీలున్న స్థలంలో మొక్కలు నాటాలని ఆయన సూచించారు. అనంతరం ఆయన ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటైన యోగా సెంటర్‌ను పరిశీలించారు.

పెండింగ్ పనులు పూర్తిచేయండి


అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటిస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని చాపలగల్లీ, బాలాగంజ్, భూలక్ష్మమ్మ దేవాలయం ప్రాంతాల్లో సివరేజ్ పైపులైన్, ప్రజా సమస్యలపై జలమండలి అధికారులతో కలిసి సోమవారం మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర పర్యటించి పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్‌లోని ప్రజలు ఎలాంటి సమస్యలున్నా... తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. హైదర్‌గూడ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, తాడ్‌బన్, రంజన్ కాలనీ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, కాలాపత్తర్, అంజదుల్లాబాగ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్‌పీఎఫ్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, గౌలిపురా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మేథర్‌వాడీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, లాల్‌దర్వాజా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అఫ్జల్‌గంజ్: 11 కేవీ తారకరామా విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి, గీతాంజలి అపార్ట్‌మెంట్, ఈడెన్‌బాగ్, మ్యాక్స్ మిల్లర్ భవన్, శాలిమార్ లైన్, భాగ్యలక్ష్మి అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అలాగే 11 కేవీ సుల్తాన్‌బజార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని అస్మాత్‌గంజ్, గడీఖానా, కేఎస్ లైన్, హనుమాన్ వ్యాయమశాల, ప్రగతి కాలేజ్, హనుమాన్ టెక్డి, మల్బినాయక్ ప్లాజా, సుల్తాన్‌బజార్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ సోమవారం పత్రిక ప్రకటనలో తెలిపారు.

33/11కెవి ఆదిత్య టవర్స్, ఆసిఫ్ నగర్, సరోజని దేవి కంటి ఆస్పత్రి సబ్‌స్టేషన్లు..

ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని హకీంపేట, అల్‌హసనత్ కాలనీ, యూసుఫ్ టేక్డి, మిరాజ్ కాలనీ, మిలటరీ పూర్తి ప్రాంతం, నిజాం కాలనీ, డీలక్స్ కాలనీ, దౌలత్ గుల్షన్ కాలనీ, బడే జానకీ నగర్, బృందావన్ కాలనీ, సబ్జా కాలనీ, రిలయన్స్ మార్ట్, అహ్మద్ నగర్, ఫస్ట్ లాన్సర్, బోలానగర్, బడాబజార్, పోచమ్మ బస్తి, ఖాజా నగర్, మిలటరీ వాల్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

33/11కెవి టోలిచౌకి సబ్‌స్టేషన్ ఫీడర్..

హకీంషా కుంట, బృందావన్ కాలనీ, చోటా జానకీ నగర్, బడా జానకీ నగర్, పారమౌంట్ కాలనీ, పేపర్ బోర్డు, హకీంపేట్, హనుమాన్ దేవాలయం, బౌలి పిటి, అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ పరిసర ప్రాంతాలు, బాబా హోటల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని తెలిపారు.

ఖేలో ఇండియా టోర్నీలో తెలంగాణ జట్టు

చార్మినార్: ఫిబ్రవరి 2వ తేదీ నుండి 9వ తేదీ వరకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పాల్గొనేందుకు తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ జట్టు అర్హత సాధించింది. మధ్యప్రదేశ్ జబల్‌పూర్‌లో జరగనున్న ఈ పోటీలకు హైదరాబాద్ జిల్లా నుంచి ఆశీర్వాద్ సక్సేనా, చిరయస్ పట్వర్ధన్, సాయిరామ్, రామకృష్ణ క్రీడాకారులు ఢిల్లీ, త్రివేండ్రంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సైక్లింగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారని అసోసియేషన్ అధ్యక్షులు పి.మల్లా రెడ్డి, జనరల్ సెక్రటరీ కె.దత్తాత్రేయలు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు

రాజేంద్రనగర్: భారత్ జోడో యాత్ర ముగింపు సందర్బంగా అత్తాపూర్ డివిజన్ పరిధిలోని దేవాలయాల్లో సోమవారం కాంగ్రెస్ నేతలు పూజలు చేశారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముద్దగోని భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పార్టీ సీనియర్‌నాయకుడు గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. దేశవ్యాప్తంగా కొనసాగిన పాదయాత్రలో స్థానిక పరిస్థితులను ప్రజలు రాహుల్‌కు వివరించారన్నారు. గతంలో ఏ నాయకుడు ఇలాంటి యాత్ర చేపట్టలేదన్నారు. జోడో యాత్ర తో కాంగ్రెస్‌కు ప్రజల్లో మరింత గుర్తింపు వస్తుందన్నారు. బీజేపీతో ప్రజలు విసు గు చెందారని సుస్థిరమైన పాలన కోసం కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కేలెండర్ ఆవిష్కరణ


కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

విజయనగర్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర పశు వైద్యాధికారుల 2023 క్యాలెండర్ ఆవిష్కరణ సోమవారం రాష్ట్ర పశు సంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా జరిగింది. మాసబ్‌ట్యాంక్ రాష్ట్ర పశు సంక్షేమ భవన్‌లోని తన కార్యాలయంలో కేలెండర్ ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌జీడీసీఎఫ్ఎల్ ఛైర్మన్ దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్ తదితరులుపాల్గొన్నారు.

ఇక నుంచి దేశాభివృద్ధికి కృషి


గుజరాత్‌కు చెందిన నవాబ్ మహ్మద్ హనీఫ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి మహమూద్ అలీ

చార్మినార్: ఇప్పటి వరకు తెలంగాణను అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్ ఇక నుంచి దేశాభివృద్ధికి కృషి చేయనున్నారని హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ అన్నారు. చార్మినార్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధి ఆధ్వర్యంలో గుజరాత్‌కు చెందిన నవాబ్ మహ్మద్ హనీఫ్ నాయకత్వంలోని పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హోంశాఖ మంత్రి వారికి పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు.

గాంధీ చూపిన మార్గంలో నడవాలి


గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తదితరులు


మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

లంగర్‌హౌస్: జాతిపిత మహాత్మాగాంధి వర్ధంతి పురస్కరించుకొని బాపూఘాట్‌లో గాంధీజీకి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్ ఆధ్వర్యంలో పలువురు నేతలు నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో బాపూస్మృతి సభ్యులు పరమానందం, కాంగ్రెస్ పార్టీ కార్వాన్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు చంటిబాబు, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

మహాత్మగాంధీకి నివాళి

యాకుత్‌పురా: జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా ఏక్తా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం దారుషిఫాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎం.రాజేశ్ యాదవ్, ఉపాధ్యక్షులు మహ్మద్ ఇషాక్, పి.మహేశ్, లక్ష్మయ్య, రమాలక్ష్మీ, శారద, శ్రీవాణి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

దూద్‌బౌలి: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం ఫతేదర్వాజాలోని ఆయన విగ్రహానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి జి.కన్నయ్యలాల్‌తో పాటు నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాత్మగాంధీతోనే ఈ రోజు భారతదేశంలో శాంతి సామరస్యం, ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తుందన్నారు. మహాత్మగాంధీ చూపిన అహింసా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. హాజీ మూసా హైదర్ జాఫ్రీ, ముజాహీద్ హుస్సేన్, భానుచందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అహింసా మార్గంలో నేటి యువత నడవాలి..

సుల్తాన్‌బజార్: జాతీ పితా మహాత్మాగాంధీ అహింసా మార్గంలో నేటి పౌరులు నడవాలని జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం ఇమ్లీబన్ బస్‌స్టేషన్‌లో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... జాతిపిత మహాత్మా గాంధీ అహింసా మార్గంతో స్వాతంత్రం తీసుకువచ్చారని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకృష్ణ, నర్సింగ్, కల్పన, రంజిత, సందీప్, రాంచందర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.


గాంధీజీకి నివాళ్లు అర్పిస్తున్న నిరంజన్ తదితరులు


మహాత్మగాంధీకి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు, చిన్నారులు

దేవర కరుణాకర్‌కు పలువురి నివాళి


దేవర కరుణాకర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీజేపి నాయకులు

గోల్కొండ: దివంగత దేవర కరుణాకర్ నిష్కళంక ప్రజానాయకుడని కార్వాన్ యువజన సంఘం అధ్యక్షులు గోవింద్ అన్నారు. సోమవారం కార్వాన్ యువజన సంఘం, విశ్వాంజనేయ భక్తసమాజం ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దేవర కరుణాకర్ సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన దేవర కరుణాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలలోని పేద బడుగు వర్గాలకు దివంగత దేవర కరుణాకర్ ఆషాదీపంగా ఉండేవారని ఆయన అన్నారు. పేదల బస్తీలలో మౌళిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తేవడం దేవర కరుణాకర్‌కే చెల్లిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో అశోక్ గౌడ్, లక్ష్మణ్, రాజేశ్వర్, దేవర రాజేశ్వరరావు, దేవర శ్రీనివాస్, దేవర వంశీ, శివకుమార్ తదితరులున్నారు.

షేక్‌పేట్‌లో చురుగ్గా అభివృద్ధి పనులు


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మహ్మద్ రాషెద్

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యులు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన డివిజన్ పరిధిలోని అల్ అమ్రా కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న వీడీసీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు తొందరగా పూర్తి చేయడమే కాక రోడ్డు నిర్మాణంలో నాణ్యత కొలమానాలు పాటించాలన్నారు. షేక్‌పేట్ డివిజన్‌లో పలు కాలనీల్లో వేసిన వీడీసీసీ రోడ్లలో నాణ్యత లోపించిందని తనకు ఫిర్యాదులు వచ్చాయని ఆయన అన్నారు. అనంతరం ఆయన అల్‌అమ్రా కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో మాట్లాడారు. కాలనీలో సమస్యలు ఎన్నో ఉన్నాయని అయితే పనులు తొందరగా జరగడం లేదని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. ఈ కాలనీ పాత ముంబాయి జాతీయ రహదారికి ఆనుకుని ఉండటమే కాక భారీ వ్యాపార సముదాయాలు కూడా ఈప్రాంతంలో ఉన్నాయని ఈ సందర్భంగా కార్పొరేటర్ అన్నారు. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుని ఈ కాలనీలో ఎన్నో పనులు చేయించానన్నారు. అయితే నిధుల కొరత కారణంగా కొన్ని పనులు జరగలేదని, త్వరలోనే కాలనీకి కొత్త హంగులు రావడం ఖాయమని ఆయన అన్నారు. ఆయన వెంట గౌస్, ఫారూక్ తదితరులున్నారు.

విద్యాసంవత్సరం ముగిశాక టీచర్ల బదిలీలు చేపట్టాలి

పంజగుట్ట: విద్యా సంవత్సరం పూర్తయ్యే వరకు టీచర్ల బదిలీలు, పదోన్నతులు ఆపాలని ఆలిండియా పేరెంట్స్ అసోసియేషన్ (ఐపా) డిమాండ్ చేసింది. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐపా రాష్ట్ర అధ్యక్షులు బుర్ర రాము గౌడ్ మాట్లాడుతూ, బదిలీలు, పదోన్నతులకు తాము వ్యతిరేకం కాదని, కానీ విద్యాసంవత్సరం ఆఖరులో ఉన్నప్పుడు బదిలీలు చేస్తే ఆ ప్రభావం విద్యార్థుల చదువులపై పడుతుందన్నారు. వేసవి సెలవుల్లో బదిలీలు చేసుకుంటే బాగుంటుందని ఆయన సూచించారు. ఇదే విషయమై విద్యాశాఖ కమిషనర్, విద్యాశాఖ మంత్రికి వివరించనున్నట్లు తెలిపారు.